# పోరాటాలతోనే సిద్ధించిన రాష్ట్రం

## మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు



తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేస్తున్న మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు

అశ్వారావుపేట టౌన్, జూన్ 3 : మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వం.. సకల జనుల ఉద్యమం.. ఎందరో అమరవీరుల త్యాగాల ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందని మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు అన్నారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవంలో భాగంగా సోమవారం స్థానిక రింగ్ రోడ్డులోని తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేశారు. అమరవీరులకు నివాళులర్పించి రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం ప్రభుత్వ వైద్యశాలలోని రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ పోరాటాలతో సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో దశాబ్ది వేడుకలను కాంగ్రెస్ ప్రభుత్వం మొక్కుబడిగా నిర్వహించిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి అమరవీరుల కుటుంబాలను పిలిపించి ఓ మూలన కూర్చోబెడితే.. మాజీ సీఎం కేసీఆర్ తెలంగాణ భవన్‌లో 20 వేల మందితో వేడుకలు నిర్వహించి .. అమరవీరుల కుటుంబాలతో కలిసి భోజనం చేసి వారి బాగోగులు తెలుసుకున్నారన్నారు. వారి కుటుంబాలకు రూ.24 లక్షల చెక్కు అందించిన ఘనత కేసీఆర్‌దేనని అన్నారు. అశ్వారావుపేటలో ఎమ్మెల్యే ఎవరో తెలియదని, అందుకు నిదర్శనమే కాంగ్రెస్ నాయకులు జాతీయ జెండా ఎగురవేయడమన్నారు. అసలు నియోజకవర్గంలో ఎమ్మెల్యే ఉన్నాడా.. లేడా.. అనే విధంగా పాలన ఉన్నదని విమర్శించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు యూఎస్ ప్రకాశ్, ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి, పట్టణ అధ్యక్షుడు సత్యవరపు సంపూర్ణ, మందపాటి రాజమోహన్‌రెడ్డి, డాక్టర్ భూక్యా ప్రసాదరావు, కలపాల దుర్గయ్య, చిప్పనపల్లి బజారయ్య, కుమారస్వామి, కోటి, ఆరేపల్లి గోవిందు, చరణ్, కలపాల దుర్గయ్య, బుచ్చిబాబు, సురేశ్, శ్రీరామ్మూర్తి, మోహన్, గొడవర్తి వెంకటేశ్వరావు, చిప్పనపల్లి శ్రీను, తాళం సూరి పాల్గొన్నారు.



జాతీయజెండాకు గౌరవ వందనం చేస్తున్న నాయకులు



జాతీయజెండాను ఆవిష్కరించి జెండా వందనం చేస్తున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధు, మాజీ ఎమ్మెల్యే సండ్ర, సీడ్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కొండబాల, నాయకులు ఆర్జేసీ తదితరులు

# ప్రభుత్వ వైఫల్యాన్ని ఎండగడతాం..

## కార్యకర్తలకు అండగా ఉంటాం..

## బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు



అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రేగా

కొత్తగూడెం అర్బన్, జూన్ 3 : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదునెలలైనా ఏ ఒక్క హామీని కూడా అమలుచేయకుండా కాలయాపన చేస్తూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోందని, ప్రభుత్వ వైఫల్యాన్ని ఎండగడతామని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు. రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో భాగంగా సోమవారం కొత్తగూడెం పట్టణంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో జాతీయజెండా, పార్టీ జెండాను ఎగురవేశారు. అనంతరం పార్టీ రథసారథి కేసీఆర్ జాతీయ ఉద్యమాన్ని నడిపిన తీరు, ఉద్యమ ఘట్టాలను ఎల్ఈడీ ద్వారా ప్రదర్శింపజేసి కార్యకర్తల్లో ఉత్సాహం నింపారు. నాడు ఉద్యమంలో పాల్గొన్న నాయకులు తమ అనుభవాలను వివరించారు. ఉద్యమం జరిగిన తీరు, మాజీ సీఎం కేసీఆర్ అనుసరించిన విధానాలు, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు చేసిన కృషిని తెలిపారు. అనంతరం రేగా కాంతారావు, మాజీ ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ అధికారం కోల్పోయినంత మాత్రాన కార్యకర్తలు అధైర్యపడాల్సిన అవసరం లేదని, ప్రతి కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుందన్నారు. అధికారంలో ఉన్నప్పుడు వచ్చిచేరిన నాయకులు పదవులు అనుభవించి వెళ్లిపోయారని, వారిని పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. కష్టపడి పనిచేసి పార్టీకి పూర్వవైభవం తీసుకొచ్చేందుకు పాటుపడదామన్నారు. క్షేత్రస్థాయి, గ్రామ కమిటీలు, పట్టణ కమిటీలు, కళాశాలల్లో విద్యార్థి కమిటీలను త్వరలోనే ప్రకటించి పార్టీని మరింత బలోపేతం చేయాలన్నారు. ప్రతిఒక్కరి సలహాలు, సూచనలు తీసుకుంటామన్నారు. మళ్లీ అధికారంలోకి వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తంచేశారు. ఆచరణ సాధ్యంకాని మోసపూరిత హామీలు, గ్యారెంటీలు ఇచ్చి ప్రజలను నమ్మించి గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు ప్రజల నమ్మకాన్ని కోల్పోయిందన్నారు. కేవలం ఐదు నెలల్లోనే వారు ప్రజల నుంచి ఛీత్కారాలు పొందుతున్నారన్నారు. కరెంట్ కోతలు, రైతులకు విత్తనాలు, ఎరువులు కూడా సరఫరా చేయలేక చేతులెత్తేస్తుందని, మహిళలకు ఇస్తానన్న నగదు పథకాలను సైతం పట్టించుకోవడం లేదన్నారు. సమస్యలు పరిష్కరించమని మొరపెట్టుకుంటే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు తాటి వెంకటేశ్వర్లు, మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, ఎంపీపీలు బదావత్ శాంతి, కౌన్సిలర్లు అంబుల వేణు, బండి నర్సింహారావు, దిండిగల రాజేందర్, ప్రబోద్‌కుమార్, సంకుబాపన అనుదీప్, పడిసిరి శ్రీనివాసరావు, మంతపురి రాజుగౌడ్, రావులపల్లి రాంప్రసాద్, కేవీ రమణ, ఎండీ హుస్సేన్, ప్రసాద్‌గౌడ్ పాల్గొన్నారు.



హరీశ్‌రావు బర్త్‌డే సందర్భంగా కేక్ కట్ చేస్తున్న నాయకులు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తాతామధు, మాజీ ఎమ్మెల్యే సండ్ర



తెలంగాణ ఉద్యమకారులను సత్కరిస్తున్న తాతా మధు తదితరులు

# దశాబ్ది.. అదుర్స్

## ముగిసిన తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దిన వేడుకలు

- బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మూడ్రోజులు అంబరాన్నంటిన సంబురాలు
- గులాబీజెండాలతో గుబాళించిన 'తెలంగాణభవన్'
- జాతీయజెండా, పార్టీ జెండాలను ఎగురవేసిన బీఆర్ఎస్ శ్రేణులు
- ఉద్యమకారులకు ఘనంగా సన్మానాలు.. అమరవీరులకు నివాళులు
- తెలంగాణ ప్రజలతో కేసీఆర్‌ది పేగుబంధం
- బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్
- పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటాం..
- సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య



వేడుకలకు భారీగా హాజరైన పార్టీ కార్యకర్తలు, అభిమానులు

ఖమ్మం, జూన్ 3 : బీఆర్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు ఆ పార్టీ ఆధ్వర్యంలో మూడ్రోజులపాటు నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ దశాబ్ది వేడుకలు ఉమ్మడి ఖమ్మంజిల్లాలో ఘనంగా జరిగాయి. బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే తాతా మధుసూదన్ ఆధ్వర్యంలో ఖమ్మం నగరంలోని ఆ పార్టీ కార్యాలయం( తెలంగాణ భవన్)లో సోమవారం ముగింపు వేడుకలు అదిరిపోయాయి. జాతీయజెండాను ఎమ్మెల్సీ తాతా మధు ఎగురవేయగా, బీఆర్ఎస్ పార్టీ జెండాను ఉద్యమకారుడు తవిడిశెట్టి రామారావు ఎగురవేశారు. అంబేద్కర్, జయశంకర్ సార్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కార్యకర్తలతో జరిగిన సమావేశంలో తాతా మధు మాట్లాడుతూ తెలంగాణ ప్రజలతో మాజీ సీఎం కేసీఆర్‌ది పేగుబంధం అని, కొట్లాడి తెలంగాణను సాధించుకున్నాం తప్ప ఢిల్లీ పెత్తందారుల మెహర్బానీతో కాదని అన్నారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో కరెంటు కోతలు, నీళ్ల కష్టాలు చూడలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చింది కరెంటు కష్టాలు, నీళ్ల కష్టాలు వచ్చాయన్నారు. ఉద్యమ సమయంలో తెలంగాణ ఉద్యమకారులపై రైఫిల్ ఎక్కుపెట్టిన రేవంత్‌రెడ్డి నేడు తెలంగాణ రాష్ట్రానికి ముఖ్యమంత్రి కావడం బాధాకరమన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని కేసీఆర్ అన్నివిధాలుగా అభివృద్ధి చేసి దేశానికే ఆదర్శంగా నిలిపారన్నారు. తెలంగాణలో కేసీఆర్ చరిత్రను చెరిపేందుకు కాంగ్రెస్ భారీ కుట్ర చేస్తున్నదన్నారు. రాష్ట్ర రాజముద్ర మార్చినా, తెలంగాణ గీతాన్ని మార్చినా ప్రజల గుండెల్లో కేసీఆర్ ముద్రను కాంగ్రెస్ పార్టీ ఎన్ని కుట్రలు చేసినా తొలగించలేరన్నారు. అన్నిరకాల అవకాశాలు కల్పించిన కేసీఆర్‌ని, తల్లి లాంటి పార్టీని కష్టసమయంలో వదిలివెళ్లిన ఏ ఒక్కరిని తిరిగి పార్టీలో చేర్చుకునే సమస్యే లేదన్నారు. కేసీఆర్ కొనసాగించిన అభివృద్ధి, సంక్షేమాన్ని రేవంత్‌రెడ్డి చిత్తశుద్ధితో అమలుచేయాలని డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి సొంత జిల్లాలోనే ప్రజాప్రతినిధులు బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీని గెలిపించడం ఆ పార్టీ కోల్పోతున్న ప్రజాదరణకు నిదర్శనమన్నారు. తెలంగాణ ఉద్యమంలో స్వరాష్ట్ర సాధన కోసం వందలాది తెలంగాణ బిడ్డలు ప్రాణాలు కోల్పోయిన పాపం కాంగ్రెస్ పార్టీదేనని అన్నారు. ప్రజల పక్షాన కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాడుతామన్నారు. బీఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలకు అన్నివేళలా అండగా ఉంటామన్నారు.

### ఉద్యమకారులకు సత్కారం

తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా తెలంగాణ పోరాటంలో భాగస్వాములై ఉద్యమం చేసిన తెలంగాణ ఉద్యమకారులను బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూదన్, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ఘనంగా సత్కరించారు.

### హరీశ్‌రావు బర్త్ డే వేడుకలు..

మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు జన్మదిన వేడుకలను పార్టీ కార్యాలయంలో ఘనంగా జరిపారు. ప్రత్యేకంగా తయారు చేయించిన కేక్‌ను కట్ చేసి స్వీట్లు పంచారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, ఎస్‌బీఐటీ విద్యాసంస్థల అధినేత ఆర్జేసీ కృష్ణ, డీసీసీబీ మాజీ అధ్యక్షుడు కూరాకుల నాగభూషణం, విత్తనాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే చంద్రావతి, ఖమ్మం నగర బీఆర్ఎస్ అధ్యక్షుడు పగడాల నాగరాజు, ఖమ్మంరూరల్ పార్టీ అధ్యక్షుడు బెల్లం వేణు, రఘునాధపాలెం మండల అధ్యక్షుడు వీరూనాయక్, నాయకులు తాళ్లూరి జీవన్ కుమార్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఖమర్, జిల్లా మైనార్టీ అధ్యక్షుడు తాజుద్దీన్, తెలంగాణ ఉద్యమకారులు బిచ్చల తిరుమలరావు, బొమ్మెర రామ్మూర్తి, నరేందర్, సతీశ్, ఉమాశంకర్, ఆసిఫ్, అఫ్జర్, కార్పొరేటర్లు దాదే అమృత, సతీశ్, మోతారపు శ్రావణి సుధాకర్, మక్బుల్, నాయకులు శీలంశెట్టి వీరభద్రం, మాటేటి నాగేశ్వరరావు, తోట రామారావు, తోట వీరభద్రం, కన్నం ప్రసన్న, రామ్మోహన్‌రావు, మెంటం రామారావు, వీరన్న, విజయ్, భారతి, సద్దాం, మాటేటి కిరణ్, దినేష్, సల్మా, మాధవి, షాకీర్, ముజాహిద్, షకీన, అబ్బాస్ పాల్గొన్నారు.

# తెలంగాణ ఉద్యమకారులకు సన్మానం

మధిర, జూన్ 3 : మధిరలో నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి లింగాల కమల్‌రాజు ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ ముగింపు వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమించిన నాయకులైన గడ్డం భద్రయ్య దంపతులతోపాటు, మందడపు రామారావును ఘనంగా సన్మానించారు. అనంతరం మదర్‌థెరిస్సా మానసిక దివ్యాంగుల కేంద్రం, ఆదరణ ఫౌండేషన్, ఆర్కే ఫౌండేషన్‌లో మానసిక దివ్యాంగులు, వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చిత్తారు నాగేశ్వరరావు, మధిర పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షుడు పల్లపోతుల వెంకటేశ్వరరావు, కార్యదర్శి అరిగె శ్రీనివాసరావు, మండల పార్టీ కార్యదర్శి బొగ్గుల భాస్కర్‌రెడ్డి, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ యన్నంశెట్టి అప్పారావు, కౌన్సిలర్ సయ్యద్ ఇక్బాల్, శివాలయం మాజీ చైర్మన్ వంకాయలపాటి నాగేశ్వరరావు, మార్కెట్ కమిటీ మాజీవైస్ చైర్మన్ కటికల సత్యనారాయణరెడ్డి, ఎంపీటీసీ నాగేశ్వరరావు, బీఆర్ఎస్ నాయకులు జేవీ రెడ్డి, జగన్మోహనరావు, నారాయణరావు, ముత్తవరపు ప్యారీ, నాగులవంచ రామారావు, ఆవుల రామకృష్ణ, వేల్పుల శివ, ఉమామహేశ్వరరెడ్డి, శ్రీనివాసరావు, కొండ, రాంబాబు, రమేష్, ప్రకాశ్ పాల్గొన్నారు.

# భవితవ్యం తేలేది నేడే..

- ఉదయం 8కి 'లోక్‌సభ' ఓట్ల లెక్కింపు ప్రారంభం
- సాయంత్రానికి వెలువడనున్న 'ఖమ్మం' ఫలితం
- 'శ్రీచైతన్య'లో భారీ భద్రత మధ్య ఓట్ల కౌంటింగ్
- ఏర్పాట్లు పరిశీలించిన ఆర్వో, ఖమ్మం కలెక్టర్, సీపీ
- ఫలితాలపై ప్రజలు, రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ

ఖమ్మం, జూన్ 3 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : లోక్‌సభ ఎన్నికల్లో ఖమ్మం నియోజకవర్గం నుంచి పోటీచేసిన అభ్యర్థుల భవితవ్యం మంగళవారం తేలనుంది. మే 13న ఖమ్మం, మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గాలకు కేంద్ర ఎన్నికల సంఘం పోలింగ్ నిర్వహించిన విషయం విదితమే. అత్యంత కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య ఆయా పార్లమెంటు నియోజకవర్గ కేంద్రాల్లో ఈ నెల 4న ఓట్లను లెక్కించనున్నారు. ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని ఏడు శాసనసభ నియోజకవర్గాల్లో పోలైన ఓట్ల ఈవీఎంలను అధికారులు భారీ భద్రత నడుమ ఖమ్మం రూరల్ మండలం శ్రీచైతన్య ఇంజినీరింగ్ కళాశాలలో ఉంచిన విషయం విదితమే. తొలుత పోస్టల్ బ్యాలెట్లను ఒకే టేబుల్‌పై లెక్కించనున్నారు. ఖమ్మం లోక్‌సభ స్థానంలోని 1,896 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి ఈవీఎంలను 115 టేబుళ్ల ద్వారా కౌంటింగ్ చేయనున్నారు. ఈ మేరకు లెక్కింపు కేంద్రంలోని ఏర్పాట్లను ఖమ్మం రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ వీపీ గౌతమ్, సీపీ సునీల్ దత్ సోమవారం పరిశీలించారు. ఓట్ల లెక్కింపు కోసం ఏర్పాటు చేసిన ప్రతి టేబుల్ వద్ద మైక్రో అబ్జర్వర్లను నియమించారు. వీరితోపాటు కౌంటింగ్ సూపర్‌వైజర్, అసిస్టెంట్ సూపర్‌వైజర్ ఉంటారు. మంగళవారం నాటి ఓట్ల లెక్కింపు కోసం సుమారు 1,500 మంది అధికారులు, ఉద్యోగులు విధుల్లో పాల్గొననున్నారు.

### 36 మంది అభ్యర్థుల్లో ఎవరికి ఎన్ని ఓట్లో..

ఖమ్మం లోక్‌సభ స్థానంలో 36 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలవగా.. ఓటర్లు ఎవరికి ఎన్ని ఓట్లు వేశారో అనే విషయం మంగళవారం సాయంత్రంలోగా తేలనుంది. అయితే ఓట్ల లెక్కింపు కోసం అభ్యర్థుల తరఫున 565 మంది ఏజెంట్లు హాజరుకానున్నారు. ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రారంభం కానుంది. ఖమ్మం లోక్‌సభ స్థానంలో 16,31,039 ఓట్లకు గాను 12,41,135 ఓట్లు పోలయ్యాయి. పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 17,645, సర్వీస్ ఓట్లు 430 పోలయ్యాయి.

### రైల్వేస్టేషన్, బస్టాండ్లలో ఎల్ఈడీ తెరలు..

లోక్‌సభ ఎన్నికల ఫలితాలను ప్రజలకు తెలియజేసేందుకు అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఖమ్మం కొత్త బస్టాండ్, పాత బస్టాండ్, రైల్వేస్టేషన్, వైరా, మధిర బస్టాండ్లలో ఎల్ఈడీ తెరలను ఏర్పాటు చేశారు. ఓట్ల లెక్కింపు కేంద్రంలో లెక్కింపు పూర్తి కాగానే ప్రతీ రౌండ్ ఫలితాన్ని ఎప్పటికప్పుడు అధికారికంగా ప్రకటించనున్నారు. ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గ ఎన్నికలను అన్ని రాజకీయ పక్షాలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవడంతో ఫలితాలపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది.

### భారీ భద్రతా ఏర్పాట్లు..

ఎన్నికల ఫలితాల నేపథ్యంలో అవాంఛనీయ ఘటనలు జరుగకుండా, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ఉండేందుకు ఖమ్మం సీపీ సునీల్‌దత్ ఆధ్వర్యంలో భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు.. కౌంటింగ్ కేంద్రం వద్ద మూడు అంచెల భద్రతను ఉంచారు. 250 మంది పోలీస్ సిబ్బందితోపాటు మూడు స్పెషల్ పార్టీల పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఓట్ల లెక్కింపు విధులు నిర్వహించే సిబ్బంది మంగళవారం తెల్లవారుజామున 4 గంటల వరకే కౌంటింగ్ కేంద్రాలకు చేరుకోవాల్సి ఉంటుంది. ఎవరు ఏ టేబుల్ వద్ద విధులు నిర్వహించాలనే అంశాన్ని 5 గంటలకు అధికారులు నిర్ణయిస్తారు. లెక్కింపు గోప్యతపై కౌంటింగ్ సిబ్బందితో రిటర్నింగ్ అధికారి ప్రమాణం చేయించనున్నారు.

### ఉదయం 8 గంటలకు లెక్కింపు ప్రారంభం..

తొలుత అభ్యర్థులు, వారి ఏజెంట్ల సమక్షంలో అధికారులు స్ట్రాంగ్ రూములను తెరవనున్నారు. ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుంది. 8:30 గంటలకు ఈవీఎంలలోని ఓట్ల లెక్కింపును ప్రారంభిస్తారు. ఖమ్మం లోక్‌సభ స్థానంలోని ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గానికి మాత్రం 18 టేబుళ్లను అమర్చారు. మిగతా ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఒక్కో నియోజకవర్గానికి 14 టేబుళ్ల చొప్పున అమర్చారు. ఆయా నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాలను బట్టి ఎన్ని రౌండ్లు ఉంటాయో నిర్ణయించనున్నారు. ఓట్ల లెక్కింపు కేంద్రంలో రిటర్నింగ్ అధికారి, అదనపు రిటర్నింగ్ అధికారి కాకుండా ఒక్కో టేబుల్‌కు ముగ్గురు అధికారులను నియమించారు. వీరి సమక్షంలో లెక్కింపు ప్రక్రియ కొనసాగనుంది. ఓట్ల లెక్కింపు ప్రక్రియను మంగళవారం సాయంత్రం 4 గంటలలోపు ముగిసేలా అధికారులు ఏర్పాట్లు చేశారు.

# జిల్లాలో 144 సెక్షన్ అమలు

## పోలీస్ కమిషనర్ సునీల్ దత్

మామిళ్లగూడెం, జూన్ 3 : పార్లమెంట్ ఎన్నికల ఓట్ల లెక్కింపు నేపథ్యంలో మంగళవారం జిల్లావ్యాప్తంగా 144 సెక్షన్ అమలు చేయనున్నట్లు పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి కౌంటింగ్ ప్రక్రియ ముగిసే వరకు ఈ నిబంధనలు తప్పక వర్తిస్తాయని పేర్కొన్నారు. సెక్షన్ అమలులో భాగంగా ప్రజలు రహదారులపై గుమిగూడి ఉండడం, సభలు, సమావేశాలు, ర్యాలీలు, డీజేలు, మైకులతో ఊరేగింపులు, ధర్నాలు నిర్వహించడం వంటివి చేయకూడదని తెలిపారు. ఓట్ల లెక్కింపు కేంద్రానికి 200 మీటర్లలోపు ఐదుగురికంటే ఎక్కువ వ్యక్తులు ఉండేందుకు అనుమతి లేదని, పోలీసు నిబంధనలు అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

**ఈవ్ టీజింగ్‌కు గురైతే సమాచారం అందించాలి**

మహిళలు, విద్యార్థినులు, యువతులు ఈవ్ టీజింగ్ బారిన పడితే వెంటనే షీ టీం సెల్ నెంబర్ 8712659222కు సమాచారం అందించాలని సీపీ సునీల్ దత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకోసం పోలీస్ కమిషనరేట్ పరిధిలో షీటీమ్ బృందంతో నిఘా ఉంచామని పేర్కొన్నారు. అలాగే సోషల్ మీడియా వేదికగా మహిళలను వేధిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇటీవల జిల్లాలో జరిగిన ఓ ఘటనలో బాధితుల ఫిర్యాదుకు వెంటనే స్పందించి నిందితుడిపై కేసు నమోదు చేశామని తెలిపారు. బస్టాండ్‌లు, రైల్వే స్టేషన్, విద్యాసంస్థలు, కూరగాయల మార్కెట్లు, బహిరంగ ప్రదేశాల్లో షీ టీమ్స్ మఫ్టీలో తిరుగుతూ నిరంతర నిఘా పెట్టినట్లు తెలిపారు. మే నెలలో 13 ఫిర్యాదులు వచ్చాయని, వాటిలో 3 ఎఫ్ఐఆర్ చేయగా.. మరో 3 పెట్టి కేసులు నమోదు చేశామని పేర్కొన్నారు. మరో ఐదుగురికి కౌన్సిలింగ్ చేశామని తెలిపారు. 48 అవగాహన సదస్సులు నిర్వహించి మహిళలు, విద్యార్థులను చైతన్యం చేశామని పేర్కొన్నారు.

# ఓట్ల లెక్కింపునకు పటిష్ఠ ఏర్పాట్లు

## కౌంటింగ్ టేబుళ్ల వద్ద మైక్రో పరిశీలకులు

## ఖమ్మం ఆర్వో, కలెక్టర్ వీపీ గౌతమ్



పరిశీలకులతో కలిసి కౌంటింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమ్

ఖమ్మం రూరల్, జూన్ 3 : కౌంటింగ్ కేంద్రంలో లోక్‌సభ ఎన్నికల ఓట్ల లెక్కింపు పకడ్బందీగా నిర్వహించేందుకు పటిష్ఠ ఏర్పాట్లు చేసినట్లు ఖమ్మం పార్లమెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ వీపీ గౌతమ్ తెలిపారు. మండలంలోని శ్రీచైతన్య ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాన్ని ఎన్నికల సాధారణ పరిశీలకులు డాక్టర్ సంజయ్ జీ కోల్టే, కౌంటింగ్ పరిశీలకుడు ప్రేదిమాన్ కృష్ణన్ భట్‌లతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ హాల్, ఖమ్మం, పాలేరు, మధిర, వైరా, సత్తుపల్లి, కొత్తగూడెం, అశ్వారావుపేట అసెంబ్లీ సెగ్మెంట్లకు సంబంధించిన కౌంటింగ్ హాళ్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్ల పోస్టల్ బ్యాలెట్ల కౌంటింగ్ షెడ్యూల్ ప్రకారం మంగళవారం నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేశామన్నారు. ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్ కౌంటింగ్ కోసం ప్రత్యేక కౌంటింగ్ హాల్‌ను ఏర్పాటు చేశామన్నారు. ప్రతి హాల్‌లో 14 కౌంటింగ్ టేబుళ్లు, ఖమ్మం అసెంబ్లీకి 18 టేబుళ్లు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. కౌంటింగ్ విధుల నిర్వహణకు ప్రతి టేబుల్ వద్ద సూపర్‌వైజర్, కౌంటింగ్ అసిస్టెంట్, మైక్రో పరిశీలకులను ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల ఫలితాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు అవసరమైన సిబ్బందిని నియమించామన్నారు. కౌంటింగ్ సెంటర్ వద్ద మీడియా సెంటర్‌ను ఏర్పాటు చేశామని, భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో సహాయ రిటర్నింగ్ అధికారులు ఆదర్శ్ సురభి, బీ.సత్యప్రసాద్, వేణుగోపాల్, ఎం.రాజేశ్వరి, జీ.గణేశ్, ఎల్.రాజేందర్, మధు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

### ఏజెంట్లకు పాస్‌లు తప్పనిసరి

కౌంటింగ్ కేంద్రానికి వచ్చే అభ్యర్థుల ఏజెంట్లు విధిగా ఎన్నికల కమిషన్ జారీ చేసిన పాస్‌లతో రావాలని కలెక్టర్ గౌతమ్ తెలిపారు. సోమవారం మండలంలోని శ్రీచైతన్య ఇంజినీరింగ్ కళాశాలలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో కౌంటింగ్ నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఖమ్మం పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లకు ఓట్ల లెక్కింపునకు ఏడు హాళ్లు ఏర్పాటు చేశామన్నారు. అదనంగా పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ కోసం ఒక హాల్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఎప్పటికప్పుడు మీడియా సెంటర్ ద్వారా, అలాగే ఖమ్మం, కొత్త బస్టాండ్, పాత బస్టాండ్, రైల్వేస్టేషన్, సత్తుపల్లి, మధిర, వైరా బస్టాండ్‌లలో ఎల్ఈడీ తెరలు ఏర్పాటు చేశామన్నారు. ఉదయం 6 గంటలకే రావాలని, పార్టీల ప్రతినిధులు 5 గంటల వరకు రావాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ మొబైల్ ఫోన్లు ఏజెంట్లు వెంట తీసుకరావొద్దన్నారు. కార్యక్రమంలో అధికారులు, పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.